క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

మదనాపురం: మండల కేంద్రం నెలవిడి, నర్సింగపురం, సరళాసాగర్, రామన్‌పాడు, కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



వనపర్తిటౌన్: ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన మోహన్ కుమార్ యాదవ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని డీసీబీసీయూ భవనంలో జిల్లా గొర్రెల కాపరుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.కురుమూర్తి యాదవ్ అధ్యక్షతన పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొర్రెలకాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.కురుమూర్తి యాదవ్ మాట్లాడుతూ... న్యాయవాదులతో పాటు ఇతరవర్గాల వారికి, ప్రజలకు న్యాయ సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో గొర్రెలకాపరుల సంఘం నాయకులు చంద్రయ్య యాదవ్, రాంచందర్ యాదవ్, నాగేంద్రం యాదవ్, రాజేష్, పరశురాం యాదవ్, నర్సింహ, కౌన్సిలర్ నాగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు..



ఆత్మకూర్: ముస్లింల అత్యంత పవిత్రమైన ప్రదేశమైన హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఆదివారం రాత్రి స్థానిక మస్జీదే సయ్యదియాలో హజ్‌యాత్రకు వెళ్తున్న దుబాయ్ ఇబ్రహీం కుటుంబ సభ్యులను మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా హఫీజ్ అజ్హర్‌అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులు మక్కా, మదీనాలో ప్రపంచశాంతి కోసం ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖలీల్, అన్వర్, రఫీఖ్, మస్తాన్, ఫెరోజ్, అహ్మద్, మునీర్, హనీఫ్, నజీర్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నల్లమల విద్యార్థి



అచ్చంపేట రూరల్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్ పోటీలకు నల్లమల ప్రాంతం అచ్చంపేటకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పట్టణంలోని ఎంఎస్ఎన్ ఎక్సలెంట్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శివరామకృష్ణ అండర్–10 విభాగంలో 100 మీటర్ల పరుగు పోటీలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ సీఎంరెడ్డి, మన్సూర్‌ఖాన్, సైదులు, రాజేందర్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్: కార్పొరేట్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటన కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు జూన్ 7వ తేదీ లోపు జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20న మేదిన పూజ, విశ్వక్సేన ఆరాధన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నాగర్‌కర్నూల్: ప్రతిఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమస్ దాస్ రాజేష్ గౌడ్ అన్నారు. మే 20న జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో పాలమూరు బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 50 మంది రక్తదానం చేశారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం



అమరచింతలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీసి సాధారణ జీవితం గడిపిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నెటితరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం జిల్లా నాయకుడు బి.వెంకటేష్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం పార్టీ నాయకులు మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామి కుటుంబంలో జన్మించారని సుందర రాం రెడ్డి అని తల్లితండ్రులు పేరు పెడితే తన పేరును సుందరయ్యగా మార్చుకున్నాడని తెలిపారు. సుందరయ్య స్వగ్రామమైన అలగాని పాడులో కుల వివక్ష లేకుండా గ్రామ మొత్తానికి సహపంక్తి భోజనాలు పెట్టి ప్రజలను చైతన్యం చేస్తూ.. వారిలో కులమతాలను దూరం చేసిన మహానుబావుడని వెల్లడించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన సుందరయ్య సైకిల్ పై పార్లమెంట్‌కు వెళ్లి ప్రజా సమస్యలను మొదట ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో విన్నవించారన్నారు. కుటుంబ పరంగా వచ్చిన ఆస్తిని పేదలకు పంచిపెట్టి సాధారణ జీవితం గడిపిన సుందరయ్య ప్రతిఒక్కరికి ఆదర్శ ప్రాయుడన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్యాంసుందర్, అజయ్, ఆర్ఎస్.రమేష్, బుచ్చన్న, సుజ్ఞానం, వెంకటేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల, తెల్లరాళ్లపల్లి తండాల్లో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బాల్యానాయక్, చిట్టెమ్మ, బాబునాయక్, రాజునాయక్, కృష్ణానాయక్, గిరిజన సంఘం నాయకులు సోమ్లనాయక్, వెంకటయ్య, కోదండరాములు, భగత్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటుగా తనకున్న ఆస్తులన్నింటినీ పేదలకు ఇచ్చేసిన గొప్ప వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కమ్యూనిస్ట్ గాంధీ సుందరయ్య 39వ, వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడారు. సుందరయ్య కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేశారని కొనియాడారు. స్వార్థం అనే పదంను తన నిఘంటువులో నుంచి శాశ్వతంగా తొలగించికున్న మహోన్నత వ్యక్తి అని ప్రశంసించారు. కవులు గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహా శర్మ, గంధం నాగరాజు, వివిధ సంఘాల నాయకులు బండలయ్య తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో సీపీఐఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల కార్యదర్శి వెంకట్రాములు హాజరై పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. చెన్నయ్య, చిరంజీవి, నాగరాజు, మన్యం, గోపాల్, అజయ్ పలువురు పాల్గొన్నారు.



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..



వనపర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు



మదనాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇంగ్లిష్‌లో పట్టు సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట: ప్రతిఒక్కరూ చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుద్దారంలో విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ గ్రామర్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టుసాధిస్తే ఎన్నో లాభాలు ఉంటాయని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలు అమలు చేయబోతోందని అన్నారు. ఏప్రిల్‌లో ప్రారంభమైన గ్రామర్ శిక్షణ నేటితో పూర్తయిందని సంఘం నాయకులు తెలిపారు. మొత్తం 150 మంది కోచింగ్ తీసుకున్నారని వివరించారు. నేటి నుంచి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 45 రోజుల పాటు మూఢనమ్మకాలు, అపోహలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, అందరూ హాజరు కావొచ్చని నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్లగౌడ్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడుదాం



సమావేశానికి హాజరైన అఖిలపక్ష నాయకులు

అయిజ: సమస్యలు పరిష్కారమయ్యే వరకు కలిసి కట్టుగా పోరాడుదామని అఖిలపక్ష కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఆదివారం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు. పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయినా సరే అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాలేదని, వెంటనే పూర్తి చేయాలని, నెల రోజులుగా పోరాటం చేస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తే తప్పా పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్ కోసం అలుపెరగని పోరాటం చేయాలని తీర్మానించారు. జూన్ 4వ తేదీ తర్వాత అఖిలపక్ష కమిటీ ద్వారా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఈనెల 26న రెడ్డి రాయల్ ఫంక్షన్‌హాల్లో మండల స్థాయి, పట్టణ స్థాయి అఖిలపక్ష కమిటీలను ఎన్నుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ పాత రవితేజ కళాశాల వెనుక పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో వైశాఖ ఏకాదశి సందర్భంగా ఆదివారం శివలింగానికి భక్తులు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఏక పారాయణ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. అదేవిధంగా గణపతి, అమ్మవారు, సూర్య భగవాన్, విష్ణుమూర్తి, నాగులకు అభిషేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో స్వామివారికి అష్టోత్తరంతో అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషి అజయ్ కుమార్ శర్మ, అర్చకులు అందాడై శ్రీనివాసచార్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మరుగునపడిన విద్యుద్దీకరణ పనులు

- పట్టించుకోని మున్సిపల్ పాలకవర్గం



ఎనిమిదో వార్డులో పనులు ఇలా..

అమరచింత: పట్టణంలో చేపడుతున్న విద్యుద్దీకరణ పనులు మరుగున పడ్డాయి. సుమారు రూ.18 లక్షలతో 4, 5, 6, 7లతో పాటు 8, 9వార్డుల్లో చేపడుతున్న విద్యుద్దీకరణ పనులు ఐదు నెలల నుంచి మరుగునపడ్డాయి. దీంతో పట్టణంలో విద్యుత్ సమస్య తీవ్రమవడంతో పాటు లోఓల్టేజీ సమస్య వేధిస్తుందని సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోలేకపోతున్నారు. పట్టణంలోని పది వార్డుల్లో గతంలో 40 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు ప్రస్తుతం దెబ్బతిని చిన్నగాలి వస్తే చాలు విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని, దశల వారీగా విద్యుద్దీకరణ పనులు చేపట్టడానికి మున్సిపల్ పాలకవర్గం తీర్మానంతో మొదటి విడతగా రూ.18 లక్షల నిధులతో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఏడాదైనా పనులు చేపట్టకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు సమన్వయంతో, మున్సిపల్ చైర్‌పర్సన్ చొరవతో ఐదు నెలల కిందట విద్యుత్ స్తంభాలు పాతారు. విద్యుత్ లైన్ అమర్చారు. 4, 5 వార్డుల్లో పనులు చేసిన కాంట్రాక్టర్ 6, 7 వార్డుల్లో స్తంభాలను పాతడం వరకే పనులు చేసి మిగిలిన పనులు అటకెక్కించాడు. అప్పటి నుంచి విద్యుద్దీకరణ పనులు మరుగున పడ్డాయి. ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పనులు వేగవంతంగా పూర్తిచేస్తామని పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తామని చెప్పుకొస్తున్నారే తప్పా.. ఇప్పటి వరకు నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్ చేపట్టలేకపోతున్నారు.

పనులు పూర్తి చేస్తాం..



పట్టణంలో నిలిచిపోయిన విద్యుద్దీకరణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు ఎంత మేరకు బిల్లులు చెల్లించారో అనే విషయాలను ట్రాన్స్‌కో అధికారులతో తెలుసుకుని మిగిలిన పనులను పూర్తి చేయించేందుకు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పూర్తిచేస్తాం.

– మంగమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్, అమరచింత

చేనేత కార్మికులను ఆదుకునేదెవరు?



మగ్గం నేస్తున్న రాఘవేంద్ర

శాంతినగర్: నిరుపేద చేనేత కార్మికులను ఆదుకునేదెవరని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాలతో బట్టలు తయారు చేస్తున్న తరుణంలో వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేతన్నల బతుకులు రోజురోజుకు ఛిద్రంగా మారుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధరలు లేక, అటు ప్రభుత్వం ద్వారా సబ్సిడీలు, సంక్షేమ పథకాలకు నోచుకోక, ఆదరణ లేక కొట్టుమిట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. మగ్గం ఆడనిదే మనుగడలేని నేతన్నల ఆవేదన ఆలకించి చేనేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలకు నిధులు మంజూరుచేసి, కొత్త పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా బీసీ గణన చేపట్టి జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం ఇటిక్యాల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలో అనేక సవరణలు చేసిందన్నారు. దీనిలో భాగంగా బీసీల రిజర్వేషన్లను 34శాతం నుంచి 23శాతం వరకు తగ్గించి బీసీలకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి బీసీలను పూర్తిగా అణిచివేసిందన్నారు. రిజర్వేషన్లు తగ్గించడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పూర్తిగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని గమనించి బీసీ గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గాల ప్రజలకు మద్దతుగా పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డుకు అనసూయ ఎంపిక

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన చతమోని అనసూయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైంది. 2019 జనవరి నుంచి 2024 జనవరి వరకు పెద్దపల్లి సర్పంచ్‌గా గ్రామంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడంతో బహుజన సమితి అకాడమి నేషనల్ కమిటీ అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు అనసూయను ఎంపిక చేశారు. అదేవిధంగా ఉత్తమ ఇంటర్‌నేషనల్ అవార్డుకు ఎంపికైంది. 2024 సంవత్సరానికిగాను పెద్దపల్లి సర్పంచ్ చతమోని అనసూయ ఎంపికకావడంతో అవార్డును బహుజన సమితి అకాడమీ నేషనల్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు సంబంధించిన పత్రాన్ని ఆమెకు అందజేశారు. జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూణెలో అవార్డు అందుకోనున్నారు.

పిడుగుపాటుకు మూగజీవాలు మృతి



వంగూరు: మండలం నిజాంబాద్ గ్రామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఒక ఆవు, మూడు మేకలు మృతిచెందాయి. రైతు లింగమయ్య సంబంధించిన ఆవు, పాపయ్యకు సంబంధించిన మూడు మేకలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతులను ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

వరి కొయ్యలను తగలబెట్టొద్దు..

వీపనగండ్ల: పంటపొలాల్లోని వరికొయ్యలు, వ్యర్థపదార్థాలను తగలబెట్టడంతో పంటలకు మేలు చేసే పోషకాలు, క్రిమికీటకాలు చనిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి కేశ్వర్‌గౌడ్ అన్నారు. పంటపొలాల్లోని వ్యర్థాలను తగలబెట్టంతో నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రియ ఎరువులను రైతులు కోల్పోతారని, ఈ విషయమై రైతులకు తమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కల్పించి, అన్ని వేలల్లో అందుబాటులో ఉంటారని అన్నారు. పంట పొలాల్లోని వ్యర్థాలను పశువుల మేతగా, వంట చెరుకు, కాంపోస్ట్, జీవన ఎరువులుగా వినియోగించుకోవచ్చని తెలియజేశారు. రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు.

పూడుకుపోతున్న చెరువు కాల్వ



అమరచింత శివారులో చెరువుకు నీటిని తరలించే కాల్వ దుస్థితి ఇలా..

అమరచింత: స్థానిక పెద్దచెరువును 15 సంవత్సరాల కిందట లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరో మారు నిధులు మంజూరు కావడంతో పూర్తిస్థాయిలో కాల్వను నిర్మించుకోనున్నారు. అమరచింత రైతులు, అఖిలపక్ష నాయకులు, ప్రస్తుతం 12 సంవత్సరాలుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలకపోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో బారీ చెట్లతో పాటు ముళ్లపొదలు నిండుకొని కాల్వను కమ్ముకున్నాయి. సాగునీటి కోసం ఖర్చుపెట్టిన సుమారు రూ.20 లక్షలు మట్టిలో కలిసిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు.

సేవలందించడం అభినందనీయం



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అమీనుల్ ఖాన్‌ట్రస్ట్ నిర్వాహకులు ఎంఏ.హఫీజ్

కొత్తకోట రూరల్: అమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తకోట పట్టణ కేంద్రంలోని క్యూఆర్ ఫంక్షన్ హాల్‌లో(ఖత్నా సున్తీ) క్యాంప్ నిర్వహించామని డాక్టర్ తౌఫిక్ ఇమామ్, డాక్టర్ మహ్మద్ ముజీబ్ తెలిపారు. ముస్లింలు సున్తీ చేసుకోవడానికి రూ.5 వేలు ఖర్చవుతుందని, ఆ ఖర్చును అమీనుల్ మెస్కిన్ ట్రస్ట్ వారు భరిస్తూ.. కులమతాలకు అతీతంగా సేవలందించడం అభినందనీయమని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. అమీనుల్ మిస్కీన్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌లో దాదాపు 120 మందికి పైగా ఖత్నా (సున్తీ) చేసుకున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ఎంఏ.హఫీజ్ మాట్లాడారు. 20 ఏళ్లుగా నిరుపేదల కోసం ఎడ్యుకేషన్, హెల్త్ క్యాంప్, వివాహాలకు సేవలందిస్తామన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏ కార్యక్రమానికైనా మంచి స్పందన వస్తుందని, రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ గఫార్, ఫయాజ్‌అలీ, జావీద్‌అలీ, మౌలానాఖాజ, షఫీ, ఆఫీస్, కమల్ రెహమాన్, ఖాద్రియమస్జీద్, మౌలానాసలాం తదితరులు ఉన్నారు.

అదుపుతప్పితే అంతే...



మూలమళ్ల -అమరచింత రహదారిలో కాల్వపై ఉన్న వంతెన దుస్థితి ఇలా..

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ ప్రధాన ఎడమ కాల్వపై నిర్మించిన వంతెనల పిట్టగోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయే అనే భయంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వంతెన దాటేస్తున్నారు. మండల పరిధిలోని అమరచింత నుంచి ములమళ్లకు వెళ్తున్న హదారిపై ఎడమ కాల్వ దాటేందుకు ఇరు గ్రామాల ప్రజల రాకపోకల కోసం వంతెన నిర్మించారు. ప్రస్తుతం వంతెన పిట్టగోడలు దెబ్బతినడంతో అవి విరిగి పడుతున్నాయి. వంతెనపై ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనాలపై వెళ్తున్న ప్రజలు వీటిని గమనించకుండా వెళ్తే.. కాల్వలో వారి వాహనాలు పడిపోనున్నాయి. ఇప్పటికైనా పీజేపీ అధికారులు స్పందించి వంతెన మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ పోటీలను వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లప్ప, తిమ్మప్ప, తిమ్మారెడ్డి, కొండలు, లాలు, బీచుపల్లి, వేణు, మాదన్న, యువకులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామకపత్రం అందుకుంటున్న శశివర్మ తేజ

అయిజ: మండలంలోని పులికల్ గ్రామానికి చెందిన శశివర్మ తేజ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ శశివర్మ తేజకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రకాష్, మోజేష్, అశోక్, యువరాజ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానిక విద్యార్థులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో ఇంటర్ విద్య వరకే ఉందని డిగ్రీ చదవేందుకు నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని దీంతో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేద విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నరని, ప్రభుత్వ డిగ్రీ కాలేజిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కల్వకుర్తి టౌన్: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య శిబిరానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆచార్య కృపానందకు నివాళి

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఆదివారం ఆచార్య పెరికె కృపానంద సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు కృపానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతాప్‌రాయ్, కవిత, వర్షారాయ్ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జీఓ నంబర్ 26 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ లెక్కలు తేల్చిన తర్వాతే స్థానిక సంస్థలను ఎన్నికలను నిర్వహించాలన్నారు.